
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 15 డిసెంబరు 2024

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా భిక్షపతి



నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న భిక్షపతి

టేకుమట్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన పొన్నం భిక్షపతి ఎంపిక య్యారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ చేతుల మీదుగా నియమాక పత్రాన్ని అందుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయ కులకు, తనపై నమ్మకంతో జిల్లా పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సాధికారతే లక్ష్యంగా పాలన

- విద్య, వైద్య రంగాల అభివృద్ధి, మహిళాభ్యున్నతికి ప్రాధాన్యం
- మాటకు కట్టుబడి ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహ
- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి భూపాలపల్లి జిల్లాలో పర్యటన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

7లో...



మహిళా సాధికారతే లక్ష్యంగా.. విద్య, వైద్యరంగాల అభివృద్ధికి కట్టుబడి తమ పాలన కొనసాగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహ అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి శనివారం భూపాలపల్లి జిల్లాలో పర్యటించిన ఆయన జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 50 పడకల సమీకృత ఆయుష్ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం మెడికల్ కాలేజీ క్యాంపస్ పనులు, జిల్లా ఆస్పత్రిలో అదనపు గదులు, మునిసిపాలిటీలో డ్రెయినేజీ పనులకు శంకు స్థాపన చేశారు. ఆ తర్వాత అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పా టుచేసిన ప్రజాపాలన బహిరంగసభలో మాట్లాడారు. రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ నేతృత్వంలో అద్భుత పాలన అందిందని.. గత ప్రభుత్వం అన్నిటినీ విస్మరిస్తే, తమ ప్రభుత్వం మళ్లీ కొనసాగిస్తోంద న్నారు. ఇక ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తున్నామన్నారు.

- భూపాలపల్లి కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి



భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ క్యాంపస్‌కు శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సభలో పాల్గొన్న మహిళలు



ఆధ్యాత్మికం ఆరోగ్యం

నియమాల మాలతో అయ్యప్ప దీక్ష

- ఉమ్మడి జిల్లాలో ఏటికేడు పెరుగుతున్న మాలధారుల సంఖ్య
- పడిపూజలతో ఉప్పొంగుతున్న భక్తిభావం

సండే స్పెషల్ SUNDAY SPECIAL

మతాలు ఏవైనా తాము నమ్మే దేవుళ్లను ఆరాధించడం ద్వారా మానసిక ప్రశాంతత పొందొచ్చని.. తద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చంటూ ఎంతో మంది ఆధ్యాత్మిక వేత్తలు.. పండితులు.. ప్రబోధకులు చెబుతుంటారు. ఆధ్యాత్మికతలో భాగమైన ధ్యానం లాంటివి చేయడం ద్వారా కొన్ని సార్లు వైద్యంతో కూడా నయం కాని రుగ్మతల నుంచి ఉపశమనం దొరుకుతుందన్నది అందరికీ తెలిసిందే. ముఖ్యంగా హిందువులు ఎంతో పవిత్రంగా భావించే.. శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం నుంచి సంక్రాంతి పర్వదిన సమయం వరకు అయ్యప్పదీక్షలను స్వీకరిస్తుంటారు. ఈ సమయంలో 41 రోజుల పాటు నియమాలతో కూడిన దీక్షను పాటిస్తారు. ఈ దీక్షలో క్రమశిక్షణతో పాటు ఆహారం తీసుకునే క్రమంలో పాటించే పద్ధతులతో ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెబుతారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అయ్యప్ప మాలలు ధరించే వారి సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. ఈ ఏడాది కూడా పడిపూజలు, పంబారట్ లాంటి కార్యక్రమాలతో సందడి కనిపిస్తోంది.

- వర్ధన్నపేట రూరల్ / కరీమాబాద్

7లో



చిన్నకాళేశ్వరం వేగం పుంజుకునేనా?



బీరాపూర్ వద్ద నిర్మించిన ఎత్తిపోతల పంప్‌హౌస్

- దశాబ్దన్నర గడిచినా పూర్తికాని ప్రాజెక్టు
- రూ.523కోట్ల అంచనా వ్యయంతో 2008లో పనులు ప్రారంభం
- బీఆర్ఎస్ హయాంలో నిలిచిన పనులు
- ఆర్థిక సాయానికి ఇటీవలే కేంద్రం సుముఖత
- పనులు పూర్తయితే 45వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి
- యంత్రాంగం నిర్లక్ష్యంతో భూసేకరణ చిక్కులు
- అధికారులపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్

భూపాలపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్లు గా సాగుతున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో ఇకనైనా వేగం పుంజుకుంటుందా? లేదా? అన్న సంశయం రైతుల్లో కనిపిస్తోంది. సరిగ్గా పదహారేళ్ల క్రితం 2008 సెప్టెంబరులో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా పునాది పడిన ఈ ఎత్తిపోతల పథకానికి 16 ఏళ్లుగా నిధుల గ్రహణం పట్టింది. ప్రాజెక్టు ప్రారంభం మొదలుకొని భూసేకరణ దాకా అన్నీ చిక్కుముడులే ఎదురయ్యాయి. మరీ ముఖ్యంగా పనులు వేగంగా జరుగుతున్న క్రమంలో 2014లో రాష్ట్ర విభజన జరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం మారడం ఈ ప్రాజెక్టు పాలిట శాపంగా పరిణమిం చిందనే చెప్పాలి. దాంతో తొమ్మిదన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును గాలికొదిలేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఈ క్రమంలోనే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం పేరిట మేడిగడ్డ ప్రాజెక్టును ప్రారంభించ డంతో ఈ ప్రాజెక్టు భవితవ్యం చిక్కుల్లో పడింది. అయితే రైతుల ఒత్తిళ్లు, వివిధ రాజకీయ పక్షాల విమర్శల నేపథ్యంలో కేఎల్ఐఎస్ ప్రాజెక్టును కాస్త ముక్తేశ్వర ఎత్తిపోతల పథకంగా (చిన్న కాళేశ్వరంగా) మార్చి ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ప్రాజెక్టు పేరునైతే మార్చారు గానీ నిధులు సమకూర్చకపో వడంతో ఏక్క అడుగూ ముందుకు పడలేదు. అప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను మెగా ఇంజనీరింగ్‌తో పాటు కిర్లోస్కర్, మరో సంస్థ కలిసి జాయింట్ వెంచర్‌గా దక్కించుకున్నాయి. అయితే నిధుల విడుదలలో జాప్యం, భూ సేకరణ చిక్కులు లాంటి పరిణామాలతో నిర్మాణ వ్యయం పెరుగుతోందనే సాకుతో ఈ సంస్థలు ప్రాజెక్టు నిర్మాణ పనుల నుంచి తప్పుకునే ప్రయత్నం చేశాయి. అప్పటి ప్రభుత్వం కూడా మేడిగడ్డపై చూపిన శ్రద్ధ ఈ ప్రాజెక్టుపై చూపకపోవడంతో ఇదే అదనుగా యంత్ర సామగ్రిని సరఫరా చేయాల్సిన కిర్లోస్కర్ సంస్థ పనుల నుంచి తప్పుకోగా ప్రస్తుత ప్రభుత్వం నచ్చజెప్పడంతో కేవలం మెగా ఇంజనీరింగ్ సంస్థ మాత్రమే ప్రస్తుతం అడపాదడపా పనులు నిర్వహిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.48కోట్ల నిధులను విడుదల చేయడం, కేంద్ర ప్రభుత్వం కూడా ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన(గతంలో ఏఐబీపీ) పథకం కింద రూ.228కో ట్లు తనవంతు ఆర్థిక సాయం అందించేందుకు సుముఖత తెలపడంతో ప్రాజెక్టు పూర్తిపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే ఇప్పటికీ ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని కీలకమైన చిక్కుముడు లు తొలగించాల్సి ఉంది. ముఖ్యంగా భూ సేకరణ అంశంలో అధికారుల పనితీరు కారణంగా సరికొత్త సమస్యలు తెరపైకి వస్తున్నాయని చెబుతున్నారు. గతంలో జరిగిన భూసేకరణలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రధానం గా పట్టేదారులు, అనుభవదారుల్లో ఎవరికీ పరిహారం చెల్లించారన్న దానిపై రికార్డులు దొరకని పరిస్థితి నెలకొందని అంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు దళారులు నకిలీ రికార్డులను సృష్టించి పరిహారం పొందేందుకు ఎత్తుగడలు వేస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమనడంతో ఈ వ్యవహారంపై మంథని శాసనసభ్యుడు, రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులపై కన్నెర్ర చేశారు. పూర్తిస్థా యిలో విచారించి దోషులను గుర్తించి క్రిమినల్ కేసులు పెట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దాంతో సర్వేయర్లు క్షేత్రస్థాయిలో సర్వే చేసేందుకు ప్రయత్నిస్తున్నా రికార్డులు సరిగ్గా లేకపోవటం తో గతంలో సేకరించిన సర్వే నెంబర్లు ఏవనే విషయాన్ని తేల్చేందుకు నానా తంటాలు పడుతున్నారని రెవెన్యూకు చెందిన విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి.

నాలుగు మండలాలు... 45వేల ఎకరాల ఆయకట్టు..

గోదావరిపై ప్రతిపాదించిన ఈ ఎత్తిపోతల పథకం ద్వారా కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్ మండలాల్లోని 45,232 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రతిపాదించారు. ఇందుకు గాను 14 చెరువులను పునరుద్ధరించి రిజర్వాయర్లుగా మార్చాలని సంకల్పించారు. అయితే వీటికి అదనంగా మరో మూడు చెరువులను కూడా కలపాలని మంత్రి అధికారులకు సూచించడంతో నీటిపారుదల శాఖ ఇంజనీర్లు రివైజ్ చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్టు తెలిసింది. కాగా, ఇప్పటికే గారెపల్లి సమీపంలో నూతన రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించారు. ఇందులో మహదేవపూర్ మండలంలోని ఎర్రచెరువు, మందిరం చెరువు, కాటారం మండలంలోని కొత్తపల్లి, కొత్తపల్లి తండా, గారెపల్లి చింతల చెరువు, ఆదివారంపేట, ధన్వాడ, గుమ్మళ్లపల్లి, గూడూర్ ఊర చెరువులు, వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్టు, మల్హర్ మండలంలోని రుద్రారం, మహాముత్తారం మండలంలోని పోలారం, ఎల్లాపూర్ చెరువులను రిజర్వాయర్‌లుగా మార్చడానికి ప్రతిపాదించి పనులను చేపట్టారు. అయితే ప్రభుత్వం నిధులు ఇవ్వక చెరువుల పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. గోదావరి జలాలను ఎత్తిపోతల ద్వారా రెండు దశల్లో సరఫరా చేయడానికి పథకం రూపకల్పన చేయగా, మొత్తం 4.5 టీఎంసీల నీటిని పంప్‌హౌస్‌ల ద్వారా చెరువుల్లోకి మళ్లించి ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు గాను కాళేశ్వరం సమీపంలోని బీరసాగర్ వద్ద స్టేజ్-1 పంప్‌హౌస్, కాటారం సమీపంలో స్టేజ్-2 పంప్‌హౌస్ నిర్మాణాలు జరిగాయి. ఇందులో మొత్తం 27 మెగావాట్ల సామర్థ్యం గల పంపులను కూడా బిగించారు.

ముందుకు కదలని భూసేకరణ

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సుమారు 3,500 ఎకరాలకు పైగా భూసేకరణ చేపట్టాలని ప్రతిపాదించారు. చెరువులను రిజర్వాయర్‌గా మార్చేందుకు, పైప్‌లైన్లు, కెనాల్స్ నిర్మాణం కోసం భూమిని సేకరిస్తున్నారు. ఇందులో 640 ఎకరాలు అటవీ భూమి కాగా, మిగతా 2900 ఎకరాల్లో పట్టా భూములు, అసైన్డ్ భూములు ఉన్నాయి. అయితే అటవీశాఖ అనుమతులు ఆలస్యంగా వచ్చాయి. కాగా, 640 ఎకరాల అటవీ భూమిని సేకరించి పైప్‌లైన్లు వేసే కార్యక్రమం చేపట్టగా కొంత మేర మిగిలిపోయింది. మిగతా 2,900 ఎకరాల్లో సుమారు 890 ఎకరాలను ఇప్పటి వరకు సేకరించినట్లు అధికారులు తెలిపారు. మిగతా 2వేల ఎకరాలకు గాను త్వరలో మరో 340 ఎకరాల భూ సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన పైప్‌లైన్ల నిర్మాణం జరిగినా ఇంకా పలుచోట్ల పైప్‌లైన్లు వేయలేదు. దీంతో పైప్‌లైన్ల కోసం వేయాల్సిన ఎంఎస్, జీఆర్పీ(గ్లాస్ రీ ఇన్‌ఫోర్స్‌డ్) పైపులు పలు చోట్ల వృథాగా పడి ఉన్నాయి. కాగా, భూసేకరణ జరిగిన భూముల రైతులకు కొందరికి ఇంకా పరిహారం అందలేదు. గారెపల్లి నూతన రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు సుమారు రూ.5కోట్లకు పైగా పరిహారం రావాల్సి ఉందని అంటున్నారు.

ప్రాజెక్టుతో 63 గ్రామాల రైతులకు ప్రయోజనం

చిన్న కాళేశ్వరం పనులను త్వరగా పూర్తి చేయాలని నాలుగు మండలాల రైతులు కోరుతున్నారు. 4.5 టీఎంసీల నీటితో నాలుగు మండలాల్లోని 63 గ్రామాల పరిధిలోని సుమారు 45,230 ఎకరాలకు పైగా ఆయకట్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందనుంది. 0.3 టీఎంసీల నీటితో తాగునీటి అవసరాలు తీర్చేలా ప్రతిపాదించారు. నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేశారని, చిన్న కాళేశ్వరాన్ని మాత్రం పుష్కర కాలం గడిచినా పూర్తిచేయడం లేదని పలువురు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మంథని నియోజకవర్గంలోని (భూపాలపల్లి జిల్లా పరిధిలోని) నాలుగు మండలాలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికైనా అధికారులు చిన్న కాళేశ్వరం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని వేలాది మంది రైతులు కోరుతున్నారు.

ప్రాణాలు తీసిన భూతగాదా

- దేవరాంపల్లిలో దారుణ హత్య
- అన్నను నరికిచంపిన తమ్ముడు, అతడి కుటుంబ సభ్యులు
- బైక్‌పై వెళ్తుండగా కళ్లల్లో కారం చల్లి గొడ్డళ్లతో దాడి

6లో



సారయ్య(ఫైల్)

కక్షిదారులు రాజీ మార్గాన్నే ఎంచుకోవాలి

భూపాలపల్లి జిల్లా జడ్జి నారాయణబాబు



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి నారాయణబాబు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు రాజీ మా ర్గాన్ని ఎంచుకొని కేసులను పరిష్కరిం చుకోవాలని భూపాలపల్లి జిల్లా జడ్జి పి. నారాయణబాబు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అ దాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మా ట్లాడారు. ప్రజలు ద్వేషభావాలను తగ్గించుకొని రాజీ మార్గాన్ని అలవాటు చేసుకో వాలన్నారు. దీంతో కేసులు త్వరితగతిన పరిష్కా రమై విలువైన సమయం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ జడ్జి జయరాంరెడ్డి, ప్రిన్సిప ల్ జూనియర్ జడ్జి ఎన్. రామచంద్రారావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగులో సమగ్రశిక్షా ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. సమగ్రశిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులందరి సర్వీసులను రెగ్యులర్ చేసేలా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని అన్నారు. రెగ్యులర్ అయ్యేలోపు వారికి పేస్కేల్ ఇవ్వాలన్నారు. సమగ్రశిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని, పీటీఐలకు 12 నెలల వేతనం అందించాలని, ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.10లక్షలు, ఆరోగ్యబీమా రూ.5లక్షలు, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. 61ఏళ్లు నిండిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. సమ్మె శిబిరంలో సంఘం రాష్ట్ర కోశాధికారి సదయ్య, జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, నాయకులు పోరిక శంకర్, సోలం కృష్ణయ్య, రమేష్, రాంబాబు, మూడ్ కనన్‌సింగ్, మహ్మద్ హమీద్, రవిచందర్, బాలాజీ, సమగ్రశిక్ష ములుగు జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాడియా కుమార్, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఫిరోజ్, సభ్యులు సుజాత, రమేష్, స్వాతి, స్వప్నలత, ప్రవీణ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం

ములుగు కలెక్టర్ కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అందించడమేకాకుండా ప్రతి విద్యార్థికీ నాణ్యమైన పౌష్టికాహారం అందించా లనే ఉద్దేశంతో 40 శాతం డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ములుగు మండలంలోని జగ్గన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం పౌష్టికాహార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థికీ కడుపునిండా తిండి, కంటినిండా నిద్రపోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుందని అన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఆహారం విషయంలో టెండర్లు నిర్వహిస్తున్నామని, అందులో పాల్గొనే వ్యక్తులు ప్రభుత్వం ఇచ్చే నిధులతో పిల్లలకు సరైన ఆహారం అందిం చలేమనే విషయాన్ని తమ దృష్టికి తీసుకురాగా డైట్‌చార్జీలను ప్రభుత్వం పెంచిందని తెలిపారు. ఏడురోజులపాటు ఏరోజు ఏ ఆహారం అందిస్తు న్నామనే విషయం తెలుసుకోవడానికి ప్రతి పాఠశాలలో బోర్డులను ఏర్పాటు చేశమన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా గత పాలకులు డైట్‌చార్జీలను పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందలేద ని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ సీఎం రేవం త్‌రెడ్డి 40శాతం డైట్‌చార్జీలను పెంచారని, 200శాతం కాస్మెటిక్ చార్జీలను పెంచారని, ఇది హర్షణీయమని అన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన హ్యాండ్‌బుక్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ దివా కర, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రవిచందర్ విద్యార్థినులతో కలిసి భోజ నం చేశారు. ఈ కార్యక్రమంలో టీసీఆర్అండ్‌టీఐ డైరెక్టర్ సముజ్వల, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పోచం, డీఈవో పాణిని, డీడబ్ల్యూవో శిరీష, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ దివాకర, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ప్రాణాలు తీసిన భూతగాదా

- దేవరాంపల్లిలో అన్నను నరికి చంపిన తమ్ముడు, అతడి కుటుంబ సభ్యులు
- కళ్లల్లో కారం చల్లి గొడ్డళ్లతో దాడి
- తృటిలో తప్పించుకున్న మృతుడి కుమారుడు


రక్తపు మడుగులో పడి ఉన్న సారయ్య మృతదేహం

కాటారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న భూతగాదా ప్రాణాలు తీసే వరకు దారితీసింది. పెద్ద మనుషుల మధ్యకు తీసుకెళ్లిన పంచాయితీ తెగకపోవడంతో అన్నపై తమ్ముడు, మరో తమ్ముడి భార్య, వారి కుటుంబ సభ్యులు గొడ్డళ్లు, రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని శంకరంపల్లి-దేవరాంపల్లి సరిహద్దులో శనివారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరాంపల్లికి చెందిన మారపాక సారయ్య (50) కొంతకాలంగా భూపాపల్లిలోని బాంబులగడ్డ ప్రాంతంలో భార్య అంకమ్మ, ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి తమ్ముడు సమ్మయ్య, మరో తమ్ముడు భార్య లక్ష్మి కుటుంబాలతో ఐదారు గుంటల భూమికి సంబంధించిన వివాదం నడుస్తోంది. గతంలోనే ఎవరి భూమి వారు పంచుకుని ఇళ్లు కట్టుకున్నారు. కొన్నేళ్లుగా తలిదండ్రులను పోషించినందుకు జ్యేష్ట పాలు కింద సమ్మయ్య, లక్ష్మికి చెందిన భూమిలోంచి చెరో రెండున్నర గుంటలు ఇవ్వాలని సారయ్య ఘర్షణ పడుతున్నాడు. భూమి విషయమై 8 నెలల క్రితం పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టగా సారయ్యకు 5 గుంటల భూమి ఇవ్వాలని చెప్పారు. ఈ ఏడాది లక్ష్మి కూతురు వివాహ సమయంలో భూమిని తనకు ఇవ్వకుంటే వారి భూమిని అమ్మడానికి ఒప్పుకోనని సారయ్య పేచీ పెట్టడంతో పెద్ద మనుషులతో చెప్పించి పెళ్లి అయిన తర్వాత భూమి విషయం మాట్లాడదామని, ఎంతో కొంత భూమి ఇస్తానని లక్ష్మి ఒప్పుకుంది. ఇటీవల భూమి అమ్మకం విషయమై సారయ్య, అతడి తమ్ముడు, మరదలు గొడవలు పడుతున్నారు. శుక్రవారం దేవరాంపల్లికి వచ్చిన సారయ్య తనకు రావాల్సిన 5గుంటల భూమి విషయమై సమ్మయ్య, లక్ష్మిలను అడగ్గా వారు ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో పెద్ద మనుషులతో పంచాయితీ పెట్టిస్తానని భూపాలపల్లికి వెళ్లిపోయిన సారయ్య శనివారం కుటుంబసభ్యులతో కలిసి మళ్లీ దేవరాంపల్లికి వచ్చాడు. సారయ్య, పెద్ద కుమారుడు శ్రీరాంతో కలిసి కుల పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా తాము 5గుంటలు ఇవ్వబోమని సమ్మయ్య, లక్ష్మి వాదించారు. దీంతో సారయ్య తన భార్య అంకమ్మ, చిన్న కొడుకు అంజికి ఈ విషయం చెప్పి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామన్నాడు. ఈ క్రమంలో సారయ్య, శ్రీరాం బైక్‌పై దేవరాంపల్లి బస్టాప్‌కు వెళ్లి వస్తున్న క్రమంలో దేవరాంపల్లి- శంకరంపల్లి సరిహద్దులో సారయ్య తమ్ముడు సమ్మయ్య, మరదలు లక్ష్మి వారి కుటుంబ సభ్యులు, మరో ముగ్గురు దాడి చేశారు.

కళ్లల్లో కారం చల్లి గొడ్డలితో నరికి సుత్తి, రాడ్లతో తలపై కొట్టడంతో సారయ్య మృతి చెందాడు. తలపై టోపీ ఉండటంతో కొంత కారం కళ్లల్లో పడ్డప్పటికీ శ్రీరాం బైక్ పై నుంచి దూకి తృటిలో తప్పించుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. సీఐ నాగార్జునరావు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా నిందితులు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది.

ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలి మృతి

కన్నాయిగూడెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా కన్నాగూడెం మండలం బుట్టాయిగూడెంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవాదుల గ్రామానికి చెందిన చిలుముల లక్ష్మి (70) బుట్టాయిగూడెంలో ఉంటున్న కూతురు ఇంటికి వచ్చింది. దేవాదులకు తిరిగి వెళ్లేందుకు తాటి చెట్ల సెంటరు వద్ద ఆర్టీసీ బస్సు కోసం వేచి చూసింది. ఏటూరునాగారం వైపు నుంచి బస్సు రాగా ఎక్కే క్రమంలో అదుపుతప్పి లక్ష్మి కిందపడిపోయింది. అదే క్రమంలో బస్సు కదలగా వెనక చక్రాల కిందపడి మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏటూరునాగారానికి తరలించారు. ఆర్టీసీ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ఎదురెదురుగా ఢీకొన్న మినీ ట్రాలీ, టవేరా
- మృతులు కామారెడ్డిగూడెం, సూర్యాపేట జిల్లా వాసులు


యాకయ్య, సంపత్ మృతదేహాలు

దేవరుప్పుల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జనగామ -సూర్యాపేట రహదారిలోని మరిపడిగ -చింతబావితండా మధ్యలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో 8మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తవేరా వాహనం ప్రయాణికులను ఎక్కించుకుని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి నుంచి జనగామ వైపు వెళ్తుండగా, జనగామ వైపు నుంచి సూర్యాపేట వైపు వస్తున్న మినీ ట్రాలీ వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంకు చెందిన మరిపెల్లి యాకయ్య-(46), సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సూరనేని సంపత్(55)లు మినీట్రాలీలో కూర్చున్నారు. ఈ ప్రమాదంలో మినీ ట్రాలీలో కూర్చున్న ఇద్దరు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, తవేరా వాహనంలో ఉన్న జనగామ మండలం వడ్లకొండకు చెందిన గోసె రాజు, దిలీప్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేష్, సూర్యాపేట జిల్లా, తిరుమలగిరికి చెందిన చిన్నబోయిన యాదగిరి, వటం సత్యనారాయణ, వటం ఆండాలు విజయవాడకు చెందిన మినీ ట్రాలీ డ్రైవర్ మర్కాపురం రాంబాబులకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108వాహనం ద్వారా జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో ప్రైవేటు వాహనంలో మృతదేహాలను మార్చురీకి తరలించారు. ఎదురెదురుగా ఢీ కొన్న వాహనాలను రోడ్డుకిందకు తొలగించారు. మృతుడు యాకయ్య కుమారుడు మరిపెల్లి బెనహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి పంచనామా నిర్వహించారు. కాగా, సూరనేని సంపత్ మృతదేహాన్ని స్వగ్రామం తిరుమలగిరికి తరలించారు.

యాకయ్య మృతి తీరనిలోటు

మరిపెల్లి యాకయ్య దేవరుప్పుల మండల మానవ వనరుల కేంద్రంలో మెసెంజర్‌గా 20 ఏళ్లుగా పని చేస్తున్నాడు. యాకయ్య అంత్యక్రియల కోసం ఎంఈవో కళావతి, ఎమ్మార్సీ సిబ్బంది రూ.10వేలు, గంట రవీందర్ రూ. 5వేలు కుటుంబసభ్యులకు అందించారు. ఎంఈవో మాట్లాడుతూ యాకయ్య మృతి ఎమ్మార్సీకి తీరనిలోటన్నారు. ఎమ్మార్సీకి వచ్చిన ఉపాధ్యాయులు, సిబ్బందితో కలగొలుపుతో ఉండే వాడన్నారు. అలాగే యాకయ్య స్వగ్రామం కామారెడ్డిగూడెం కావటంతో ఆయన మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. మృతుడు యాకయ్యకు భార్య వాణితో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.


వేణుగోపాల్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

ఏఐసీసీ నేతను కలిసిన ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజ్యసభ సభ్యులు కేసీ. వేణుగోపాల్‌ను శనివారం మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. న్యూఢిల్లీలో ఎంపీ కేసీ. వేణుగోపాల్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు.

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు కేసీ. వేణుగోపాల్ సూచించినట్లు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం

ములుగు జిల్లా జడ్జి సూర్య చంద్రకళ

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని, జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను రాజీ కుదుర్చుకుని ప్రశాంత జీవనం గడపాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్‌వీపీ.సూర్యచంద్రకళ అన్నారు. శనివారం ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఆమె జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే అప్పీల్ ఉండదని, ఇదే అంతిమ తీర్పు అని అన్నారు. ఈసందర్భంగా లోక్ అదాలత్‌లో మూడు బెంచీలను ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న 1882 కేసులను పరిష్కరించారు. అనంతరం కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కన్నయ్యలాల్, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి జె.సౌఖ్య, ములుగు డీఎస్పీ రవీందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వినయ్‌కుమార్, అదనపు పీపీ కె.రుధిర, సీఐ శంకర్, ఎక్సైజ్ ఎస్సై ఎం.సుధీర్‌కుమార్, ములుగు, వెంకటాపూర్ ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, జె.సతీష్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.సునీల్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సూర్య చంద్రకళ

లోక్ అదాలత్‌లో 6,303 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ

వరంగల్ లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహించి మొత్తం 6,303 కేసులు పరిష్కరించినట్లు వరంగల్ జిల్లా జడ్జీ నిర్మలా గీతాంబ తెలిపారు. జాతీయ రాష్ట్ర న్యాయ సేవాసంస్థల ఆదేశానుసారం శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 31 బెంచిలు ఏర్పాటు చేశామని తెలిపారు. సివిల్ కేసులు 9, ప్రమాదబీమా కేసులు 41 పరిష్కరించి బాధితులకు రూ.2కోట్ల 65 లక్షల 40 వేలు ఇప్పించారు. అలాగే 435 క్రిమినల్ కేసులు, బ్యాంక్ ప్రీలిటికేషన్ 20 కేసులు పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, బ్యాంకుల ఆధ్వర్యంలో 700 మంది కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు అందించారని పేర్కొన్నారు. అంతకుముందు ఉదయం 10 గంటలకు జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జీ మాట్లాడుతూ.. రాజీ మార్గం ద్వారా నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులు పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు జి. ప్రేమలత, మనీషా శ్రావణ్ ఉన్నమ్, బి.అపర్ణాదేవి, వరంగల్, హనుమకొండల జిల్లాల న్యాయ సేవాసంస్థల కార్యదర్శులు. ఎం.సాయికుమార్, క్షమా దేశ్‌పాండే, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్‌రావు, వరంగల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తీగల జీవన్‌గౌడ్, హనుమకొండ, వరంగల్ చీఫ్ లీగల్ ఏడ్ కౌన్సిల్స్ శ్రీకాంత్, సురేశ్, ఇతర న్యాయవాదులు లోక్‌అదాలత్ బెంచ్ సభ్యులు, వివిధ బ్యాంక్ ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు, పోలీసులు పాల్గొన్నారు.

పురాతన ఆలయంలో తవ్వకాలు

పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఈవో


మాటేడు గ్రామ శివాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపిన ప్రదేశం

తొర్రూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాకతీయులు క్రీ.శ 1120 కాలంలో నిర్మించిన శైవాలయం, వైష్ణవ ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి తవ్వకాలు జరిపిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... తొర్రూరు మండలం మాటేడు గ్రామ శివాలయంలో వాచ్‌మెన్ సింగారపు ఐలయ్య రోజు మాదిరిగానే ఆలయాలను శుభ్రం చేయడానికి ఉదయం 5 గంటల సమయంలో వచ్చారు. ఈ క్రమంలో నంది విగ్రహం వెనకాల తవ్వకాలు జరిపినట్లు ఉండడంతో స్థానికులు, దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

ఆయన సమాచారం మేరకు ఆలయ ఈవో వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు. కాగా, ఆలయంలో గతంలో దొంగతనాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్థులు వెల్లడిస్తున్నారు. పురాతనమైన ఆలయానికి రక్షణ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు.

రుచి చూసి భోజనం అందివ్వాలి

గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కమిషనర్ శైఫుల్లా

పాలకుర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలకు అనుకూలంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కమీషనర్ శైఫుల్లా ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం డైట్ మెనూను ప్రారంభించారు. డైనింగ్ హాలును పరిశీలించి, మెనునూ పాటిస్తురా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ డైట్ మెనూను పారదర్శకంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం పెట్టే ముందు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు కూడా రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు భోజనం ఇవ్వాలని ఆదేశించారు. మెనూ పాటించడంలో ఎలాంటి లోటు పాటు లేకుండా యాజమాన్యం ఆదిశలో పని చేయాలని ఆదేశించారు. వివద్యార్థుల ఆరోగ్య విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు. ఇటీవల రాష్ట్రం అనేక గురుకుల్లో ఇటీవల భోజనం కలుషిత ఆహారం తినడం వల్ల అనేక మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఈ నేపథ్యంలో ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు కొంత మేర అన్యాయం జరుగుతుందని భావించిన ప్రభుత్వం ఈ చర్యలకు ఆదేశించిందన్నారు. ఆయన వెంట డీఆర్‌డీవో పీడీ వసంత, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ప్రిన్సిపాల్ స్వరూప, ఆర్ఐ రాకేష్, ఎంపీవో రవీందర్ ఉన్నారు.


వంట గదిని తనిఖీ చేస్తున్న శైఫుల్లా ←

అర్ధరాత్రి కలప దందా

పట్టించుకోని అధికారులు


మహబూబాబాద్ నుంచి రాత్రి ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

నెహ్రూసెంటర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏదైనా పెద్ద చెట్టు కనబడితే.. పాపం.. అడ్డంగా నరికి.. ముక్కలు.. ముక్కలు చేసి సొమ్ము చేసుకుంటున్న వైనం ఇది. ఇటీవల కలప దందాకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. మహబూబాబాద్ జిల్లా శివారు గ్రామాలు, మండలాలు, ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో నుంచి అక్రమగా కలప తరలుతోంది. కలప అక్రమ వ్యాపారులు ఈ మధ్య తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వేప, పెద్దేగి, సంద్ర, తుమ్మ చెట్లను తరలిస్తూ తమ వ్యాపారాన్ని మూడు పూలు.. ఆరు కాయలుగా మార్చుకుంటున్నారు. ఊర్లల్లో ఉండే పురాతన పెద్ద చెట్లను సంబంధిత రైతులు, యాజమానులనుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని మిషన్‌లతో కోసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. పాలకులు, ఫారెస్టు అధికారులు , రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. అర్ధరాత్రి మహబూబాబాద్ మీదుగా ఖమ్మం, విజయవాడ, ఇతర నగరాలకు తరలిస్తున్నారు. అధికారులు చొరవ చూపి మహా వృక్షాలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

టీపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సమ్మయ్య

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా గౌరవ అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించి సంఘీభావం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ సుమారు 20 ఏళ్లుగా విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి సమగ్రశిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించి కనీస వేతనాలు అమలుచేస్తామని హామీ ఇచ్చారని, దానిని హామీని నిలుపుకోవాలని అన్నారు. శ్రమకు తగిన మినిమం టైంస్కేల్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈ శిబిరంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాల ఉప్పస్వామి, ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు, ఉపాధ్యక్షులు గుగులోత్ రాందేవ్, సాంబయ్య, మండల అధ్యక్షుడు వైనాల స్వామి, భద్రునాయక్, సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు వైభవ లక్ష్మి షాపింగ్ మాల్ ప్రారంభం

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్ చౌరస్తాలో ఆదివారం ఉదయం 11 గంటలకు వైభవలక్ష్మి షాపింగ్ మాల్ ప్రారంభిస్తున్నామని డైరెక్టర్లు వర్రి లలిత్, ప్రదీప్‌కుమార్ బజాజ్, సూరజ్ సరడ, రిషిత తెలిపారు. ముఖ్య అతి థులుగా రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహ రి, కేఆర్.నాగరాజు, దొంతి మాధవరెడ్డి, శాసన మండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ గందె కల్పన హాజరవుతారని తెలిపారు. ప్రారంభ వేడుకల సందర్భంగా రూ.10వేల వస్త్రాలు కొనుగోలు చేసిన వారికి ఉచితంగా బంగారు నాణెం ఇస్తున్నామని, విద్యా ర్థుల కోసం ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తామని ప్రకటించారు. ఈ వేడుకలకు ప్రజలంద రూ తరలిరావాలని వారు శనివారం ఒక ప్రకటనలో కోరారు.


షాపింగ్ మాల్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

ఫిజికల్ డైరెక్టర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

మానుకోట జాతీయ రహదారిపై బంధువుల ధర్నా

నెహ్రూసెంటర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని రైలు ప్రమాదంలో మృతి చెందిన ఫిజికల్ డైరెక్టర్ గుగులోతు వీరన్న కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మానుకోటలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారి 365పై శనివారం మృతుడి బంధువులు ధర్నా చేపట్టారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం మల్యాల శివారు చోక్లతండాకు చెందిన గుగులోతు వీరన్న నర్సంపేట శివారు అశోక్‌నగర్‌లో సైనిక్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల అదిలాబాద్‌లో నిర్వహించే చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోటీలకు అశోక్ నగర్ సైనిక్ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులను వెంట తీసుకువెళ్లారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి రన్నింగ్‌లో ఉన్న రైలు కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి బంధువులు వీరన్న మృతదేహాన్ని తీసుకుని అశోక్‌నగర్ పాఠశాల వద్ద ధర్నా చేసేందుకు యత్నిస్తుండగా విషయం తెలుసుకున్న పోలీసులు అదే వాహనాన్ని మహబూబాబాద్ జిల్లాలో స్వస్థలమైన చోక్లతండాకు వైపు మళ్లించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోగానే మృతుడు వీరన్న బంధువులు భారీగా చేరుకుని జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు.


హైవేపై ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

అనంతరం గురుకుల శాఖ డిప్యూటీ సెక్రటరీ డీఎస్. జగన్‌నాయక్ తక్షణ సాయం కింద రూ.50 వేలు వీరన్న కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో బంధువులు ధర్నాను విరమించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారథి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో చలి పులి



ఏటూరునాగారం ఏజెన్సీలో స్వెటర్లు ధరించి చలి మంట కాచుకుంటున్న వృద్ధులు

- పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులు
- రాత్రి వేళ శీతల గాలుల ప్రభావంతో అవస్థలు

ఏటూరునాగారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో చలి పంజా విసురుతోంది. వారం రోజులుగా ములుగు జిల్లాలోని గోదావరి తీరంలో ఏజెన్సీ ప్రజలు చలి తీవ్రతకు గజగజ వణికిపోతున్నారు. శీతల గాలుల ప్రభావం, పొగ మంచు కురుస్తుండడంతో ఉదయం 10గంటల వరకు కూడా ఇళ్లనుంచి బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం 6 గంటల నుంచే చలి ప్రారంభమవుతోంది. ఉదయం 10గంటల వరకు సూర్యుడు మంచు తెరల మాటునే ఉంటున్నాడు. దీంతో రోడ్లు సరిగా కనిపించక వాహనదారులు తంటాలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, యువతి, యువకులు, అనే తేడా లేకుండా చలి మంటలు కాగుతున్నారు. రోజు వారి అవసరాలు, వ్యవసాయ కూలి పనులకు వెళ్లే రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రగ్గులు, చలి కోట్లు, స్వెటర్లు ధరించి వెళుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలైన ఏటూరునాగారం, వాజేడు, కన్నాయిగూడెం, మంగపేట, (నూగూరు)వెంకటాపురం, త్వాడాయి మండలాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆయాప్రాంతాల్లో 11డిగ్రీల నుంచి 12 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వారం క్రితం 18డిగ్రీలు ఉన్న రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. చలితో పాటు శీతల గాలులు చిన్నారులు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చలి గాలుల కారణంగా శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా రెండేళ్ల లోపు చిన్నారులు న్యుమోనియా బారిన పడుతున్నారని, ఆస్తమా బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

సిరులు కురిపిస్తున్న అరటి

కృషి



అరటి గెలలు

నామమాత్రపు పెట్టుబడితో అధిక లాభాలు » ఒకసారి మొక్క నాటితే మూడు పంటలు

ఆత్మకూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వాణిజ్య, సంప్రదాయ పంటలు సాగు చేసి నష్టపోతున్న రైతులు.. పంటల మార్పిడితో లాభాలబాట పడుతున్నారు. ఉద్యానశాఖ అధికారుల సూచనలతో పలు పంటలు సాగు చేస్తున్నారు. అందుకు ఆత్మకూరు మండలంలోని గూడెప్పాడ్, ఆత్మకూరు, చౌళ్లపల్లి, పెద్దాపురం, అక్కంపేట గ్రామాల్లోని పలువురు రైతులే నిదర్శనం. గతంలో పత్తి, మిర్చి పంటలు వేసి ఆర్థికంగా నష్టపోయి.. అప్పుల ఊబిలో నుంచి బయటపడేందుకు అరటి సాగుపై దృష్టి పెట్టారు. ఉద్యానశాఖ అధికారులు ఇస్తున్న సూచనలు, సలహాలను పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందుతున్నారు. ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ గ్రామానికి చెందిన తొట్ల రాజు అనే రైతు తనకున్న రెండు ఎకరాల్లో అరటి సాగు చేసి.. గేదెల పెండ, గొర్రెల మందలను పెట్టిన అనంతరం నర్సరీలోని మొక్కలను తీసుకవచ్చి మొక్కలను నాటారు. యూరియా, డీఏపీ, 20-20తో పాటు నామమాత్రంగా పై మందులను పిచికారీ చేస్తున్నారు. మధ్యలో కూలీలతో కలుపు తీయించి క్రమం తప్పకుండా నీటిని అందించారు. ఇందుకు గాను ఎకరం తోటకు రూ.60వేల వరకు ఖర్చు చేయగా.. ఇప్పటి వరకు నాలుగు సార్లు అరటి గెలలు చేతికొచ్చాయి. ఈ క్రమంలో గెలలు కోసిన ప్రతీసారి రూ.40 వేలపైగా లాభం వచ్చిందని ఆయన తెలిపారు. పెట్టిన పెట్టుబడులు పోను దాదాపు ఎకరానికి రూ.1.50లక్షల నుంచి రూ. 2లక్షలు లాభం వస్తుందన్నారు. ఒక్క సారి మొక్క నాటుతే మూడు సంవత్సరాల వరకు సాగుకు అనుకూలంగా ఉంటుందని, అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవని రాజు తెలిపారు. అరటి గెల కొట్టిన వెంటనే మొగివరకు నరికి వేయాలని, అలాగే దాని చుట్టూ ఉన్న పిల్ల మొక్కల్లో ఒకదానిని మాత్రమే ఉంచి మిగితావి తొలగించాలన్నారు. అప్పుడే మొక్క ఏపుగా పెరుగుతుందని, గెల సైజు పెరుగుతుందన్నారు. అరటిలోని గడ్డి, ఇతర మొక్కలను ఎప్పటికప్పుడే తొలగించాలని రైతు తెలిపారు. హార్టికల్చర్ అధికారుల సూచనలు పాటిస్తే అధికదిగుబడులు వస్తాయన్నారు.

అరటి సాగుతో లాభాలు గడిస్తున్నారు

మధులిక, ఉద్యానశాఖ అధికారి



ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల 74 మంది రైతులు 122. 3హెక్టార్లలో అరటి సాగు చేస్తూ లాభాలను గడిస్తున్నారు. మా సూచనలు పాటిస్తూ తక్కువ మందులను వాడడంతో పాటు పంటల మార్పిడి చేయడం వల్ల పంటలకు తెగుళ్ల నివారణతో పాటు పెట్టుబడి తక్కువవుతుంది. దిగుబడి రావడంతో రైతులు సంతోషంగా ఉంటున్నారు. పంటలను పరిశీలించి అవసరమైన సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

అరటి గెలను చూపిస్తున్న రైతు తొట్ల రాజు





అరటి గెలలను ట్రాలీలో ఎక్కిస్తున్న కూలీలు

సాగులో యంత్ర సాయం

- వరి కోతలకు హార్వెస్టర్.. గడ్డి కట్టేందుకు బేలర్
- కూలీల సమస్య నుంచి ఉపశమనం
- పని సులభం, సమయం ఆదా

వర్ధన్నపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటల సాగంటేనే సవాలక్ష సమస్యలు. అందులో ప్రధానమైంది కూలీల కొరత. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది రైతులకు భారంగా పరిణమించింది. ఈ సమస్యను అధిగమించడంతో పాటు సమయాన్ని ఆదా చేసుకునేందుకు రైతులు యంత్రాల వినియోగంపై దృష్టిసారిస్తున్నారు. ఇందులో భాగంగా కోత, కలుపు తీతకు యంత్రాలను వినియోగిస్తున్నారు. అయితే హార్వెస్టర్లతో కోయడం వల్ల గడ్డి కట్టలు కట్టేందుకు వీలుగా ఉండని నేపథ్యంలో ఇప్పుడా గడ్డిని కట్టేందుకు కూడా బేలర్ యంత్రాలను యంత్రాలను వినియోగిస్తున్నారు. యంత్రాల రాక ముందు కరిగెట మొదలుకుని నాటు వేయడం, కలుపుతీయడం, మందులు చల్లడం, కోతలు కోయడం, ధాన్యం వేరు చేయడం, పశుగ్రాసాన్ని కూడగట్టడం అన్ని కూలీలతోనే చేయించుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో వస్తున్న యాంత్రీకరణతో రైతులకు శ్రమ, సమయాభావం తగ్గిస్తున్నాయి. ఒక్క ఎకరం వరి కోయడానికి సుమారు 12మంది కూలీలు కావాలి. ఒక్క రోజు కోస్తే మరో రోజు దగ్గరకి వేయాలి. మరుసటి రోజు పశువులతో బంతులు తొక్కించాలి. ఇలా తక్కవలో తక్కువ మూడు రోజులు పడుతుంది. అదే హార్వెస్టర్ అయితే ఒకే గంటలో ఎకరా పంట కోస్తుంది. ధాన్యం కూడా వెంటనే వస్తుంది. పైగా దీనికి కూలీలకంటే తక్కువ అంటే.. సుమారు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు ఖర్చు అవుతుంది. అయితే ఇలా హార్వెస్టర్‌తో కోయడం వల్ల గడ్డి కట్టలు కట్టేందుకు అనుకూలంగా ఉండటం లేదు. అయితే పశువులకు పశుగ్రాసం అవసరమైన రైతులు.. ఆ గడ్డిని కట్టలు కట్టించేందుకు వ్యయప్రయాసలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బేలర్ యంత్రం రావడంతో రైతుల బెంగతీరింది. హార్వెస్టర్లు కోసిన గడ్డిని బేలర్‌తో సునాయసంగా కట్టలు కట్టిస్తున్నారు. ఒక్క రోజులో పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని కట్టలు కడుతుండగా.. యంత్రం యజమానులు కట్టకు రూ.35లు చొప్పున తీసుకుంటున్నారు.



వరి పంటను కోస్తున్న హార్వెస్టర్



వరి గడ్డిని మోపులుగా చుడుతున్న బేలర్

కూలీల బాధ తప్పింది

బి. దేవేందర్‌రావు, వర్ధన్నపేట



ఐదు ఎకరాల్లో వరి వేశా. నాటు సమయంలో 60 మంది కూలీలకు రూ.60వేలు ఖర్చయ్యింది. నాటు వేసేందుకు మూడు రోజులు పట్టింది. ఈ క్రమంలో కూలీల కోసం ఇబ్బందులు పడ్డాం. ఇక పంట కోసేందుకు కూలీల కొరత ఉండటంతో హార్వెస్టర్‌తో కోయించాం. 6.30 గంటల సమయంలో పంట కోశాం. ఇందుకు రూ.20వేలు మాత్రమే ఖర్చయింది.

బేలర్‌తో గడ్డిని సులభంగా దగ్గర వేశాం..

కందుగుల నర్సయ్య, రైతు, వర్ధన్నపేట



ఈ రోజుల్లో పశుగ్రాసం డిమాండ్ బాగా పెరిగింది. యంత్రంతో కోసిన పశుగ్రాసం దగ్గర వేసుకోవడానికి బేలర్ ఎంతో మేలుగా ఉంది. ఒక్కగడ్డి కట్ట కట్టడానికి రూ.35 తీసుకుంటున్నారు. గతంలో గడ్డి కోసి కుప్పలు వేయడంతో పోలిస్తే బేలర్ వాడకంతో ఖర్చు బాగా తగ్గింది. పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ఉంటుంది.

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం

- నియమాల మాలతో అయ్యప్ప దీక్ష
- ఉమ్మడి జిల్లాలో ఏటికేడు పెరుగుతున్న మాలధారుల సంఖ్య
- పడి పూజలతో ఉప్పొంగుతున్న భక్తిభావం

సండే స్పెషల్ SUNDAY SPECIAL



శబరిమలలో అయ్యప్ప దర్శనం కోసం క్యూలో నిలుచున్న మాలాధారులు

వర్ధన్నపేట రూరల్ / కరీమాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎవరి నమ్మకాలు వారివి.. మతమేదైనా దైవ చింతన అనేది ఆరోగ్యానికి కూడా మంచిదే అనేదే అందరి అభిప్రాయం. దేవుడిని పూజించడం, ఆరాధించడం, వ్యసనాలకు దూరంగా ఉండటం లాంటి వాటితో పలు రుగ్మతలకు ఆసుపత్రులకు వెళ్లకుండానే సమాధానం దొరుకుతుందని చెబుతుంటారు. ఈ నేపథ్యంలో హిందువులు అన్ని మాసాల్లోకి పవిత్రంగా భావించే కార్తీకమాసం నుంచి సంక్రాంతి సమయం వరకు అయ్యప్పదీక్షలను తీసుకుంటారు. కార్తీక మాసం ప్రారంభం నుంచే అయ్యప్ప దీక్ష తీసుకునే స్వాములు రెండు పూజల్లో పాల్గొంటారు. ఈనెల 26 న శబరిమలలో జరిగే మండల పూజకు కొంత మంది స్వాములు హాజరయ్యేలా మాలధారణ చేస్తారు. మరికొంత మంది స్వాములు జనవరిలో సంక్రాంతి రోజున జ్యోతి దర్శనానికి వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. సంక్రాంతి పండుగ రోజున అయ్యప్ప జ్యోతి రూపంలో దర్శనం ఇచ్చే రోజున స్వాములు ఎంతో భక్తిశ్రద్ధలతో శబరిమల సన్నిధానంలో వేచి చూస్తారు. ఇలా దీక్షలు తీసుకునేవారి సంఖ్య ఉమ్మడి జిల్లాలో ఏటికేడు పెరుగుతోంది. 41 రోజుల పాటు నియమాలతో కూడిన దీక్షను పాటించే స్వాములు క్రమశిక్షణ, ఆహారం విషయంలోనే కాకుండా వారి నడవడికలో మార్పు వస్తుంది. ఇందులో ఆధ్యాత్మికతకు తోడు ఆరోగ్య, మానసిక అంశాలు ఇమిడి ఉన్నాయని నమ్ముతారు. తెల్లవారు జామున చన్నీటి స్నానం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతల క్రమబద్ధీకరణ జరుగుతుందని, శరరీంపై ఒత్తిడి తగ్గుతుందని, ఒక పూట భోజనం వల్ల ప్రోటీన్లు, విటమిన్లు, పీచు పదార్థాలను శరీరం చక్కగా వినియోగించుకుంటుందని చెబుతారు. గ్యాస్, ఊబకాయం లాంటి ఇబ్బందులు నియంత్రణలో ఉంటాయని, నేలపై నిద్రించడం వల్ల నాడీ, రక్త ప్రసరణ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తాయని, శారీరక నొప్పులు తగ్గుతాయంటారు. కాళ్లకు చెప్పులు వేసుకోకపోవడం వల్ల పాదాలు నేలను తాకుతూ ఆ ఒత్తిడితో రక్త ప్రసరణ సక్రమంగా సాగుతుందట.

ఒక్కో దానిలో ఒక్కో ఆరోగ్య సూత్రం

- అయ్యప్ప మాలల్లో ఉండే రుద్రాక్షలు రక్త ప్రసరణను ప్రభావితం చేసి కోపాన్ని నియంత్రిస్తాయట. తులసి శరీరంలోని అధిక ఉష్ణాన్ని నియంత్రిస్తుందని, స్పటికాలు దేహంలోని ఇటాక్సిన్లను శోషించుకుంటాయని చెబుతున్నారు.
- సూర్యోదయానికి ముందు చన్నీటి స్నానంతో మెదడులోని కణాలు అధిక శక్తివంతంగా మారతాయని, సాయంత్రం చేసే స్నానం దేహశుద్ధితో పాటు మానసిక ప్రశాంతతకు ఉపకరిస్తుందని నమ్ముతారు.
- మాలాధారులు స్నానం అనంతరం నుదుటన విభూదిని ధరిస్తారు. నుదుటన ప్రతీ ఒక్కరికి జ్ఞాననేత్రం ఉంటుందని, విభూధిని ధరించడం ద్వారా జ్ఞానంతో పాటు రుద్రత్వం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.
- విభూదితో పాటు ధరించే చందనం అనవసర దాహాన్ని నివారిస్తుందని, చందనం సువాసనతో క్రిమికీటకాలు దరిచేరవని స్వాములు చెబుతున్నారు.
- పాదరక్షలు లేకుండా నడక సాగిస్తే పాదాలకు ఇసుక, రాళ్ల ఒత్తిడి జరిగి ఆక్యుప్రెజర్ ఏర్పడుతుందని, తద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుందని నమ్ముతారు.
- నల్లని రంగు దస్తులను ధరించడంతో శరీర ఉష్ణోగ్రతలను నియంత్రిస్తూ చలి నుంచి కాపాడుతాయి.
- మరో ముఖ్యమైన అంశం భోజనం. మాలధారులు ఒంటి పూట భోజనం చేయడం ద్వారా ఆయుర్వేద వైద్యం ప్రకారం ప్రాంకియాసిస్, కాలేయం, పొట్ట శుభ్రమవుతుందని, శరీరంలో కొవ్వు తగ్గుతుందని, ఊబకాయానికి విరుగుడుగా పనిచేస్తుందని చెబుతున్నారు. అయ్యప్ప మాలధారులు మధ్యాహ్నం భిక్ష (భోజనం), రాత్రి సద్ది (అల్పాహారం) తీసుకుంటారు.
- నేలపై చాప, దిండు లేకుండా నిద్రించడంతో భూమికి ఉన్న అయస్కాంత శక్తి ప్రభావంతో మెడ, నడుము నొప్పులు తదితర రుగ్మతలు పోతాయట.
- కఠోర నియామాల కారణంగా వ్యసనాలకు దూరంగా ఉంటారు. కొందరు మద్యం, ధూమపానం తదితర వ్యవసనాల బారిన పడినవారు ఈ మాలధారణ సమయంలో వీటిని మరిచిపోయి.. ఇరుముడి అనంతరం కూడా క్రమశిక్షణతో ఉండటానికి దోహదపడుతుందని చెబుతున్నారు.
- రెండు పూటల పూజా సమయంలో కర్పూరం వెలిగించడం, హారతి తీసుకోవడం ద్వారా సైనస్ లాంటి అలర్జీలు పోతాయట.
- ఆలయాలు, దేవస్థానాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మహాపడిపూజలు, సహపక్తి భోజనాలతో కుల, మత, జాతి, వర్ణ బేధాల్లేకుండా పాల్గొనడంతో అందరితో కలిసిపోయి సమస్యలను మరిచి ప్రశాంతతను పొందుతారు. భజనల్లో రెండు చేతులతో చప్పట్లు కొట్టడంతో శక్తి ఉత్పన్నమవుతూ రక్తప్రసరణ పెరుగుతుంది. ఇటీవల పలు గ్రామాల్లో ఇతర మతాల వారు కూడా అయ్యప్ప స్వాములకు భిక్ష, సద్ది లాంటివి ఏర్పాటు చేస్తూ సర్వమత సమానత్వాన్ని చాటుతున్నారు.
- ఇక అందనికీ స్వామి అని సంబోధించడం, భార్య సహా మహిళలందరీ మాత అంటూ పిలవడం ద్వారా స్త్రీల పట్ల గౌరవభావం పెంపొందుతుంది.

కఠినమైన దీక్షతో ఎంతో మార్పులొస్తాయి..

అంబటి రాజు, గంట స్వామి, ఇల్లంద



మూడో సారి అయ్యప్ప దీక్ష తీసుకున్నాను. మొదటి సారి కన్నెస్వామిగా స్వామిగా, రెండోసారి కత్తి స్వామిగా సేవలో తరించాను. ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రతీ ఏటా మాలవేయాలని నిర్ణయించుకున్నాను. ఎంతో కష్టమైన ఈ దీక్షతో మనలో ఎన్నో మార్పులు వస్తాయి. ఆధ్యాత్మికతను, ఆరోగ్యాన్ని వేర్వేరుగా చూడలేం. దీక్ష చేపట్టిన తర్వాత గురుస్వాములు, ఆధ్యాత్మిక వేత్తలు చెబుతుంటే ఆరోగ్యానికి ఈ దీక్ష ఎంత మేలు చేస్తుందో అర్థమైంది. పలు రుగ్మతల నుంచి ఉపశమనం పొందిన స్వాములు ఎంతో మంది ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- పేదల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మరిపెడలో న్యూ కామన్ డైట్ మెనూ ప్రారంభించిన మంత్రి



మరిపెడలో రిబ్బన్ కట్ చేసి అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

మరిపెడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో శనివారం న్యూ కామన్ డైట్ మెనూ ప్రారంభించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వం పదేళ్లలో రూ.7.19 లక్షల కోట్ల అప్పు చేయగా నెలకు వాటికి వడ్డీ రూ.6500 కోట్లను చెల్లిస్తూనే ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేడు గగ్గోలు పెడుతుందని ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు మంచి భోజనం పెట్టడానికి 40 శాతం మెస్ చార్జీలను పెంచి 200 శాతం కాస్మెటిక్ చార్జీలను ఇస్తున్నామన్నారు. కడుపునిండా తిండి ఉంటేనే విద్యార్థులు లక్ష్య సాధనను చేరుకుంటారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావించి మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. దీంతో పాటు రాష్ట్రంలోని పాఠశాలల్లో 667.25 కోట్లతో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తోందన్నారు. హాస్టళ్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ఆకునూరి మురళి అధ్యక్షతన స్టేట్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.5 వేల కోట్లతో ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేసి యువతను అన్ని స్థాయిల్లో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందన్నారు. రూ.10 లక్షల వరకు వైద్య భీమా కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందేలా ప్రభుత్వ కార్యచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంవత్సర కాలంలోనే చేసి చూపించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, తొర్రూరు ఆర్డీవో, డీఎస్పీ, కాంగ్రెస్ నేతలు వంటికొమ్ము యుగంధర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌రెడ్డి, తాజోద్దీన్, మాజీ ఎంపీటీసీ అంబరీష, మాజీ సర్పంచ్ రాంలాల్, ప్రిన్సిపల్ దయాకర్ పాల్గొన్నారు.

మంత్రి పర్యటనలో అనూహ్య సంఘటన

మరిపెడలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 7వ తరగతి విద్యనభ్యసిస్తున్న ఓ విద్యార్థి మంత్రికి ఎదురుగా వచ్చి నమస్కారించి సార్ నేను మీ వీరాభిమానిని.. సార్ మా తల్లిదండ్రులు పూరిగుడిసెలో నివసిస్తున్నారు.. తమకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలంటూ వేడుకున్నాడు. స్పందించిన మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌తో మాట్లాడి ఆ విద్యార్థి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు గిఫ్టుగా ఇవ్వాలని ఆదేశించారు.

సాధికారతే లక్ష్యంగా పాలన

- విద్య, వైద్య రంగాల అభివృద్ధి, మహిళాభ్యున్నతికి ప్రాధాన్యం
- మాటకు కట్టుబడి ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సభలో మాట్లాడుతున్న మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాల అభివృద్ధితోపాటు మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన శనివారం భూపాలపల్లి జిల్లాలో పర్య టించారు. జిల్లా కేంద్రంలోని రామప్పకాలనీ క్వార్టర్స్ వద్ద నిర్మించిన 50 పడకల సమీకృత ఆయుష్ ఆస్పత్రిని ప్రారంభించారు. రూ.130 కోట్లతో నిర్మించనున్న మెడికల్ కాలేజీ క్యాంపస్ పనులకు, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి (జీజీహెచ్)లో రూ. 13 కోట్లతో నిర్మించనున్న 90 పడకల అదనపు గదులకు, భూపాలపల్లి మునిసిపాలిటీలో రూ.4కోట్లతో చేపడుతున్న డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మొగుళ్లపల్లి మండలానికి కేటాయించిన అంబులెన్స్‌ను ప్రారంభించారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన బహిరంగసభలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 8 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్, 28 పారామెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిందన్నారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధి, మహిళా సాధికారతకే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. గతంలో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అద్భుత పాలనను అందించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం మహిళ సాధికారతను విస్మరిస్తే, తమ ప్రభుత్వం మళ్లీ కొనసాగిస్తోందని తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఆరోగ్యశ్రీ పథకానికి రూ.5లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామన్నారు. పేదల ఆరోగ్యం కోసం మరో రూ.10లక్షలు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలు 400 శాతం పెంచామన్నారు. జిల్లాకు రెండు సబ్ సెంటర్లు, రెండు పీహెచ్‌సీలను మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. జిల్లాలో జాతీయ రహదారి ఉండగా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజల ప్రాణాలను కాపాడుకునేందుకు అంబులెన్స్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారని, దీన్ని తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన కోరిక మేరకు పలిమెల, గోరికొత్తపల్లి మండలాలకు అంబులెన్స్‌లను మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో రూ. 130 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రభుత్వానికి రెండు కళ్లు : మంత్రి శ్రీధర్‌బాబు

విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా భావిస్తున్న ప్రభుత్వం వీటికి ప్రాధాన్యమిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాజకీయాలను అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఆ హామీని నెరవేర్చామన్నారు. జిల్లాకు 203 వైద్య పోస్టులు మంజూరైనట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మృతదేహాలు భద్రపరిచేందుకు ఏసీ గదిని మంజూరు చేస్తామన్నారు. మహారాష్ట్ర నుంచి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి రోగులు వస్తుంటారని, వారికి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. చిట్యాల సీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. జిల్లాకు ప్రభుత్వం నర్సింగ్ కాలేజీని కేటాయించిందని, రూ. 26కోట్లతో కాలేజీ భవనం మంజూరైందని తెలిపారు.

అభివృద్ధిపై చిత్తశుద్ధితో ఉన్నాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పేర్కొన్నారు. ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వం వైద్యానికి ప్రాధాన్యమిస్తోదని, ఆయుష్ ఆస్పత్రి భవనంతో పాటు 200 పోస్టులు మంజూరు చేసిందన్నారు. ఇక సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను నింపేలా ఆ సంస్థ సీఎండీని ఆదేశించాలని మంత్రులను కోరారు, రామప్ప నుంచి డీబీఎం 38 కాల్వకు లింకు కలిపితే కొత్తపల్లిగోరు, రేగొండ, చిట్యాల, గణపురం మండలాల్లోని 44,700 ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంటుందని తెలిపారు. దీన్ని మంత్రులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ములుగు
ఆదివారం 15 డిసెంబరు 2024
8

మేడారం అడవుల పునరుద్ధరణకు ఐదేళ్ల యాక్షన్‌ప్లాన్

- విపత్తుల పరిశోధనకు ఆటోమెటిక్ వెదర్ స్టేషన్
- భారీ వెదురు వనం పెంపు
- 3.9 కిలోమీటర్ల మేర చైన్‌లింక్ ఫెన్సింగ్
- రూ.4 కోట్లతో ప్రతిపాదనలు



అగస్టు 31న ఈదురు గాలులకు ధ్వంసమైన అడవి

ములుగు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): టోర్నడో తరహా రాకాసి గాలులకు విధ్వంసానికి గురైన ములుగు జిల్లాలోని మేడారం అడవుల పునరుద్ధరణకు అటవీ శాఖ సన్నద్ధమైంది. దెబ్బతిన్న అడవికి పూర్వ వైభవాన్ని తీసుకురావడంతోపాటు సంరక్షిం చేందుకు ఐదేళ్ల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. అక్టోబరు చివరి వారంలోనే ములుగు డీఎఫ్‌వో ద్వారా ప్రభుత్వానికి నివేదిక చేరింది.

రూ.4 కోట్లతో ప్రతిపాదన

ఈఏడాది ఆగస్టు 31న తుఫాను ప్రభావంతో వీచిన బలమైన గాలులకు మేడారం-ఐలాపూర్ మధ్యలోని అడవి తీవ్రంగా దెబ్బతింది. 332 హెక్టార్లలో 37 వేల చెట్లు కూకటివేళ్ల సహా నేలకూలగా 51,600 చెట్లు విరిగి పోయాయి. ఊహించని ఈ భారీ విపత్తు అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. సెప్టెంబరు 4న పీసీసీఎఫ్ డోబ్రియాల్ సంఘటనా ప్రదేశాన్ని స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని అటవీ శాఖ సిబ్బందిని బృందాలుగా నియమించి నష్టాన్ని అంచనా వేశారు. ఈక్రమంలో ఉన్నతాధికారుల సూచన మేరకు జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ రూ.4 కోట్లతో అక్టోబరు 26న ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు.

ఆరు అంశాలుపై దృష్టి

అడవిని సాధారణ స్థితికి తీసుకురావడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అటవీ శాఖ ఆరు అంశాలపై దృష్టి సారించింది. మనుషులు, పశువులు, మేకలు అడవిలోకి ప్రవేశించకుండా రోడ్డుకిరువైపులా 3.9కిలోమీటర్లు, లోపలికి వెళ్లే మార్గంలో రెండు చోట్ల 500 మీటర్ల చొప్పున చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయిం చారు. మనుషులు, పశువుల సంచారం లేకుంటే కొత్తమొక్కలు వేగంగా పెరగడం, విరిగిన చెట్లు త్వరగా పూర్వ స్థితికి వస్తాయనేది అధికా రుల అభిప్రా యం. అదేవి, దంగా అగ్ని ప్రమాదాల నివారణ కోసం 80 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్స్ ఏర్పా టు చేయాలని ప్రతిపా దించారు. ప్రమాదవ శాత్తు అగ్గి పుడితే ఆర్పేం దుకు ఐదు ఫైర్ బ్లోయ ర్లను సమకూర్చు కుంటారు. రౌండ్ దిక్లాక్ అడవిని పహారా కాసేందుకు పదిమందితో క్విక్ రెస్పాన్స్ టీంను నియమించనున్నారు. 25 కిలోమీటర్ల నడక టెస్టు నిర్వహించి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన స్థానిక యువకులను విధుల్లోకి తీసుకుంటారు. సుమారు లక్ష చెట్లు విరిగిపోవడంతో ఇప్పుడా ప్రాంతమంతా మైదానంలా మారింది. బలమైన గాలులను తట్టుకొని నిలబడటంతోపాటు మిగతా అడవి ప్రభావితం కాకుండా కాపాడే వెదురు వనాన్ని పెంచాలని నిర్ణయించారు. చెట్లన్నీ విరిగిపోవడంతో సూర్యరశ్మి ధారాలంగా ప్రవహించి మహవీర్, లాంటానా, యుపటోరియం వంటి కలుపు మొక్కలను విస్తరిస్తున్నాయని అధికారులు గుర్తించారు. వీటిని ప్రాథమిక దశలో నివారించనున్నారు. సారవంతమైన నేల కారణంగా మేడారం అడవులు ఏపుగా పెరుగుతున్న క్రమంలో వరదలకు మట్టి కొట్టుకుపోకుండా కరకట్టలను నిర్మించనున్నారు. నీటి అవసరాల కోసం సోలార్ బోర్‌పంపులను కూడా ప్రతిపాదించారు.



నేలకూలిన భారీ వృక్షాలను రంపాలతో కోస్తున్న ఫారెస్టు సిబ్బంది



దెబ్బతిన్న అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ దోబ్రియాల్ (ఫైల్)

లోతైన పరిశోధన అవసరం

ఈదురుగాలులకు చెట్లు నేలకూలిన ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కాగా తాజాగా సంభవించిన భూకంపం అందరినీ కలవరానికి గురిచేసింది. భూకంప కేంద్రం ఈ ప్రదేశానికి ఉత్తరం దిశలోనే ఉందని తేలడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మేడారం ప్రాంతంపై లోతైన పరిశోధన అవసరమని అధికారులు భావిస్తున్నారు. మొదట డ్రోన్ల ద్వారా లైడార్ సర్వేచేసి డిజిటల్ మ్యాప్‌ను రూపొందించనున్నారు. మొత్తం వరంగల్ రీజియన్‌లోనే ఐఎండీ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ లేకపోవడంతో ఇక్కడ సంభవిస్తున్న విపత్తులను ముందుగా తెలుసుకోవడం, కారణాలను అన్వేషించడంలో జాప్యం జరుగుతోంది. తాడ్వాయి-మేడారం మధ్య ఈ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌ను నెలకొల్పేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. దీనిని సెంట్రల్ సర్వర్‌కు లింక్ చేయడం ద్వారా వర్షాలు, ఈదురు గాలులు, ఎండతీవ్రత, భూ కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు కలుగుతుంది. అదేవిధంగా ఎన్‌జీఆర్‌ఐ పరిశోధనకు అధికారులు విజ్ఞప్తి చేశారు. బలమైన గాలుల కారణంగా చెట్లు కూలినట్లు స్పష్టం కాగా అసలు భూమిలో ఏం జరుగుతోందో తేల్చే పరిశోధనలు జరగాలనేది ప్రధాన ఉద్దేశ్యం.

టింబర్ డిపోకు ఏడువేల దుంగలు

ములుగు జిల్లాలో 76 శాతం అడవి ఉంది. 2.9 లక్షల హెక్టార్లలో అభయారణ్యం విస్తరించింది. అరుదైన వృక్ష, జంతుజాతులు, వాగులు, వంకలు, జలపాతాలు, కొండలతో అందమైన అడవిగా ప్రాచుర్యం పొందింది. ఆగస్టు 31న ప్రకృతి ప్రకోపానికి మేడారం అడవిలో పడిపోయిన చెట్లలో 7వేల చెట్లను విలువైనవిగా గుర్తించారు. వీటిలో నల్లమద్ది, టేకు, నారేప, ఎగిస వంటి గృహోపకరణాలకు ఉపయోగించే వృక్షజాతులు ఉన్నాయి. ఇప్పటికే కూలిన చెట్ల కటింగ్ పనులు జరుగుతుండగా ఈ విలువైన 7వేల దుంగలను ఏటూరునాగారంలోని ప్రభుత్వ టింబర్ డిపోకు తరలించి వేలం వేయనున్నారు. మిగతా చెట్ల అవశేషాలు తేలికగా భూమిలో కలిసిపోయే గుణం ఉండటంతో వాటిని అలాగే వదిలేస్తున్నారు.

అడవికి పునరుజ్జీవం పోస్తాం



భారీ ఈదురుగాలులకు ధ్వంసమైన మేడారం అడవికి పునరుజ్జీవం పోసేందుకు కృషి జరుగుతోంది. ఉన్నతాధికారుల సూచనతో అక్టోబరులో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాం. ప్రకృతి విపత్తులపై విస్తృత పరిశోధన జరగడంతోపాటు ప్రమాదాన్ని ముందస్తుగా పసిగట్టే సాంకేతికత కోసం ప్రతిపాదించాం. ఆమోదం లభించిన వెంటనే పనులు మొదలుపెట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

- రాహుల్ కిషన్‌జాదవ్, ములుగు డీఎఫ్‌వో

విద్యారంగంపై ప్రత్యేక దృష్టి

మంత్రులు రాజనర్సింహ, శ్రీధర్‌బాబు



గాంధీనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

గణపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే గురుకులంలో డైట్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి మంత్రులు శనివారం ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం విద్యార్థుల నుద్దేశించి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకే డైట్ మెనూను రూపొందించినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని, బలవర్ధక ఆహారం అందించాలని అన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలనిఅన్నారు. గడిచిన పది సంవత్సరాల కాలంలో డైట్ చార్జీలు పెంచలేదని, ఇప్పుడు పిల్లల ఉజ్వల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని 40శాతం డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మించి ప్రైవేటుకు దీటుగా అన్ని సౌకర్యాలు కల్పించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ, ఆర్డీవో మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 56 కోట్ల బీటీ రోడ్డు పనులకు మంత్రుల శంకుస్థాపన

రేగొండ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాగిర్తిపేట శివారులో రూ. 56కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించాం : మంత్రి దామోదర

భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమ మంత్రి దామోదార రాజనర్సింహ వైద్యులను హెచ్చరించారు. జీజీహెచ్‌లో వైద్యులతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సమావేశమయ్యారు. వైద్యసేవలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని, పెద్దపల్లి నుంచి ప్రజలకు జీజీహెచ్‌కు వైద్యసేవలకు వస్తుంటారని, మెరుగైన వైద్య, నాణ్యమైన వైద్యం అందించాలని అన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ మెడికల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వాణి, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, జీజీహెచ్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డైట్ మెనూను పకడ్బందీగా అమలు చేయాలి : కాటారంసబ్ కలెక్టర్



డైట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ మయాంగ్ సింగ్

కాటారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచి ఏర్పాటు చేసిన కామన్ డైట్ మెనూను పకడ్బందీగా అమలు చేయాలని సబ్ కలెక్టర్ మయాం క్సింగ్ విద్యాలయాల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. శనివారం గిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకులాల్లో ఏకరీతి ఆహార ప్రణాళిక (యూనిఫాం డైట్ మెనూ) కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ గురుకులాల ఓఎస్డీ ఎల్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ లాల్, నాగలక్ష్మిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో విద్యార్థులకు సక్రమంగా భోజనం అందేలా, పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా కామన్ డైట్ మెనూ ప్రోగ్రాంను పలు విద్యాసంస్థల్లోనూ ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై ప్రభుత్వం కాస్మోటిక్, డైట్ చార్జీల పెంపు చర్యలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో అయా విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ మానస, సునీత, వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, వార్డెన్స్ పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు శారద, రమాదేవి, జాడి శ్రీశైలం, సురేందర్, జ్యోతి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో కొత్తడైట్ మెనూ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో డైట్ చార్జీలు పెంచిందన్నారు. ఉపాధ్యాయులు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడంతో పాటు నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేవ ుశాఖ అధికారి చిన్నయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గడ్డం కోంరయ్య, జిల్లా కార్యదర్శి ముకిరాల మధువంశీ క్రిష్ణా, సీనియర్ నాయకులు ఓరం సమ్మయ్య, దొడ్డి కిష్టయ్య, గుమ్మ డి సత్యం, చిలుకల రాయకోంరు, దబ్బెట అనిల్, కుమార్, వివిధ గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, మండల, జిల్లా నాయ కులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయస్వామి జయంతోత్సవం



పూర్ణాహుతి హోమంలో దుద్దిళ్ల శ్రీనుబాబు దంపతులు

కాటారం, డిసెంబరు 14: మండలంలోని ధన్వాడ గ్రామంలో శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త జయంతోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. వేదపండితులు కృష్ణ మోహన్, ప్రవీణ్, గణేష్, ఆశీష్, సుమిత్‌పాండే దత్తనవరాత్రి ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు జయంతి వేడుకల్లో పాల్గొని 108 దివ్యజ్యోతులతో స్వామివారి ఊరేగింపు చేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తల్లి జయశ్రీ, సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు, నితిక దంపతులు దత్త జయంతి వేడుకల్లో భాగంగా ఆలయంలో మహా నారాయణ చండీహోమం చేపట్టి పూర్ణాహుతితో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన భక్తులు, గ్రామపెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు

కాకతీయఖని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో మహిళలకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి ఈ నెల 23న సింగరేణి డే కార్యక్రమం సందర్భంగా స్థానిక అంబేద్కర్ క్రీడా మైదానంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.


రెండు ఎక్స్‌కావేటర్ల సీజ్

వెంకటాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరభద్రవరం గ్రామ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు ఎక్స్‌కావేటర్లను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. తహసీల్దార్ లక్ష్మీరాజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వీరభద్రవరం గ్రామ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం అందిందని అన్నారు. దీంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి రెండు ఎక్స్‌కావేటర్లను చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించామని అన్నారు. దాడుల్లో ఆర్‌ఐ మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి, గౌరవ అధ్యక్షుడి నియామకం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కుక్కల నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా బండి రాజు నియామకం అయ్యారు. ఈమేరకు శనివారం హనుమకొండలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, ములుగు జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్, నాయకులు శ్యామ్, సంకెళ్ల శ్రీధర్, ఆళ్ల నరేష్, బండి రామ్, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, నీరటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఆలయంలో సందడి



దేవాలయంలో ఓంకారనాదం చేస్తున్న విద్యార్థులు

వెంకటాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకులు, విద్యార్థులతో సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకు లతోపాటు విద్యార్థులు పెద్దసంఖ్యలో రామప్పకు చేరుకున్నారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నందీశ్వరుడిని దర్శించుకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి అబ్బుర పడ్డారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడిపూజ



పడిపూజలో అయ్యప్ప భక్తులు

గణపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన సూర్యదేవర కార్తీక్‌స్రవంతి దంపతుల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించగా హరిహర క్షేత్ర ప్రధాన అర్చకుడు పద్మనాభ గురుస్వామి హాజరై అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ పెద్ద ఎత్తున స్వాములు పాల్గొని భజన పాటలు, భక్తి గీతాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హాజరయ్యయరు.

విద్యార్థుల అవసరాలపై దృష్టి పెట్టాలి

- ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార అవసరాలపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా అన్నారు. శనివారం ఏటూరునాగారం మండలం చల్పాక గ్రామంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత (బాలుర) పాఠశాలను పీవో సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా రాష్ట్రంలో అన్ని విద్యాసంస్థల్లో ప్రారంభించిన కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎనిమిదేళ్లలో ఆహార చార్జీలు 40శాతం పెరిగి, 16 సంవత్సరాలలో కాస్మెటిక్ చార్జీలు 200శాతం కంటే ఎక్కువ పెరిగిన విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులకు పీవో వివరించారు. విద్యార్థుల పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని తెలియజేశారు. ఈ కొత్త కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయిలో విద్యను అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం పాఠశాలల్లోని వంటగది, భోజన ప్రాంతం, మరుగుదొడ్ల తదితర గదులను, నీటి నిర్వహణ, పరిశుభ్రత స్థాయిలను పరిశీలించారు. ఆహారం ఎలా తయారు చేసి పంపిణీ చేస్తున్నారో పరిశీలించారు. అహారం కలుషితం కాకుండా చూసుకోవడానికి తీసుకుంటున్న జాగ్రత్తలను సిబ్బందిని అడిగి ఆమె తెలుసుకున్నారు. పీవో వెంట స్టాటిస్టికల్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం. రాజ్‌కుమార్, జీసీఎం సీఎంఆర్‌సీ పి.సుగుణతో పాటు సంబంధిత హెచ్ మాస్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, సిబ్బంది, ప్రాజెక్ట్ ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య మహాసభ కమిటీ ఎన్నిక

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహాసభ ములుగు మండల నూతన కమిటీని శనివారం ములుగులో జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మహాసభ మండల అధ్యక్షుడిగా కొమురవెల్లి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా యాంసాని సురేష్, కోశాధికారిగా యాద సంపత్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్, బీజేపీ జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు

గణపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ పోరాట ఫలితంగా భాషాపండితులకు పదోన్నతి కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్రీయ పండిత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శనివారం పట్టణంలో జిల్లా సర్వసభ్య సమావేశం జరగగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా ప్రతాప్, సలహాదారుడుగా శివశంకర్, అధ్యక్షుడు బైరి నరసింహాస్వామి, సహాధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షులుగా శరత్‌బాబు, చంద్రమౌళి, భాస్కర్, రఘుపతి, అమ్జద్‌షేక్ పాల్గొన్నారు

పీఈటీకి సంతాపం

కాటారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ సొసైటీలో 2021 నుంచి అశోక్ నగర్ సైనిక్ స్కూల్‌లో పీఈటీగా పని చేస్తూ విధి నిర్వహణలో రైలు ఢీకొని మృతి చెందిన జి.వీరన్న కుటుంబానికి ప్రభుత్వం రూ. కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలని గురుకులాల పార్ట్‌టైం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి బి.రాజు, గురుకుల కళాశాల అధ్యక్షుడు మంథెన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంపత్, రజిత, కృష్ణమాచారి, రామృష్ణ రాజయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిచర్ల ఎస్టీ హాస్టల్‌లో డైట్ కార్యక్రమం

మల్హర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తాడిచర్లలోని ఎస్టీ హాస్టల్‌లో శనివారం ఒకే విధమైన ఆహారం అందజేసే డైట్ కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్యామ్ సుందర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ హాస్టల్ వార్డెన్ వినోద్‌తో కలిసి ప్రారంభించారు. పెంచిన డైట్ చార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్‌భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల హాస్టల్‌ను సందర్శించిన ఎంపీడీవో

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రంలోని గిరిజన బాలికల హాస్టల్‌ను ఎంపీడీవో సందర్శించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి జారీ చేసిన నూతన డైట్ మెనూను ఆవిష్కరించారు. హాస్టల్ పిల్లలకు నూతన కామన్ డైట్ మెనూలో ప్రభుత్వం సూచించిన విధంగా భోజనం అందించాలన్నారు. ఎంపీడీవో వెంట హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, బ్రాహ్మణపల్లి, పంచాయతీ కార్యదర్శి సరిత ఉన్నారు.

విద్యార్థులు రాణించాలి : ఎంఈవో

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని స్థానిక ఎంఈవో రేగ కేశవరావు అన్నారు. శనివారం మండలవ్యాప్తంగా ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో నూతన డైట్ అమలు కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా మండలకేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈవో కేశవరావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధితోపాటు నాణ్యమైన పోషకాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపూర్, (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో టి.ప్రభాకర్ అన్నారు. మండలంలోని రామాంజాపూర్ టీడబ్ల్యూహెచ్‌ఎస్ బాలికల పాఠ శాలలో శనివారం ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీల సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం హెచ్‌ఎం శంకరయ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ఎంపీడీవో రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసమావేశంలో ఎంపీడీవో రాజు, డిప్యూటీ వార్డెన్ తిరుమల్‌సింగ్, స్టాఫ్ సెక్రటరీ ధరంసింగ్, గ్రామపెద్దలు భగవాన్‌రెడ్డి, స్వామి, అనసూర్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

కాటారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాలకు చెందిన సమగ్ర శిక్షా ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్న తమకు ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు వరప్రసాద్, రవిశంకర్, సురేష్, సంపత్, సమ్మయ్య, రోజ, రాణి, స్వరూప, కేజీబీవీ ఉపాధ్యాయులు నళిని, కవిత, స్వప్న, రాజేశ్వరి, శ్రీలత, అరుణ, శిరీష పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో మహిళ కాలుకు తీవ్ర గాయమైన ఘటన భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి క్రాస్ సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడేనికి చెందిన కూచన శారద భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి (ఎస్‌ఎం) గ్రామానికి చెందిన ఆమె అక్క ఇంటికి వెళ్తున్న క్రమంలో చెల్పూరులో బస్సు దిగింది. ఆమెను తీసుకెళ్లేందుకు ఆమె అక్క కుమారుడైన మంథెన శివకృష్ణకు చెల్పూరుకు ద్విచక్రవాహనంపై వెళ్లి వాహనం ఎక్కించుకొని కొత్తపల్లి(ఎస్‌ఎం)కి బయలుదేరాడు.

ఈ క్రమంలో భూపాలపల్లి నుంచి పరకాల వైపునకు వెళ్తున్న ఇసుక లారీ మోరంచపల్లి క్రాస్ వద్ద మూలమలుపు తిరుగుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో శారద కిందపడిపోగా లారీ ఆమె ఎడమ కాలుపైనుంచి వెళ్లగా కాలు తొంటి భాగం వరకు పూర్తిగా నుజ్జునుజ్జయింది. వాహనం నడుపుతున్న శివకృష్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గమనించిన స్థానికులు 108లో గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు.